మూడువారాల కథ

రెండవ వారం...

# బావ తమరు భామ ఎవరు?

## - రాధ



మరో నాలుగు నెలల తరువాత ఒక రోజున జ్యోతి స్నేహితురాలు భారతి ఇంటికి వెళ్ళింది సంగీతం నేర్చుకోవటానికి. శంకరాభరణం శాస్త్రిగారి లాంటి సంగీతం మాష్టారు ఆ ఇద్దరికీ ప్రయివేటు శిక్షణ ఇస్తున్నారు ఓ రెండు నెలలుగా.

సంగీత సాధన పూర్తయ్యాక గురువు గారు అక్కడ నుండి కదిలాక ఆడపిల్లలు ఇరువురూ సోషల్ మీటింగ్ పెట్టి స్టార్ టివి నుండి కాలేజీ గందరగోళాల వరకూ ఓ అరగంట లోకాభిరామాయణం చర్చించారు.

ఆ తరువాత భారతి ఓ తెలుగు దినపత్రికలో పడ్డ ప్రకటన చూపిస్తూ, ''మనం ఈ పోటీకి వెళ్తే ఎలా వుంటుందే జ్యోతీ' అని అడిగింది ప్రియమిత్రురాల్ని.

''నీకేమైనా మతిపోయిందా ... అలాంటి పోటీల స్థాయికి మనం ఇంకా చేరలేదే... మన లిమిట్ అంతా బాత్‌రూమ్‌లో ప్రేమదేశం పాటలు పాడడం వరకే...'' ఫక్కున నవ్వింది జ్యోతి.

''నోనో... నా సంగతి తెలీదుకాని నువ్వు మాత్రం తప్పకుండా పైస్థాయికి చేరావనే నా నమ్మకం...'' వక్తలా వక్కాణించింది భారతి.

''సో వాట్...'' జ్యోతి అయిష్టత వ్యక్తపరిచింది ముఖకవళికల్లో.

''వాట్ లేదు నాట్ లేదు... నేను చెప్పినట్లు చేయవే'' స్నేహితురాలిని ప్రేమగా శాసించింది భారతి.

మరో అర్ధగంట వాదోపవాదాలు, తర్జుమాలు అయిన తరువాత ఆ భామినులు ఇరువురూ రాజీ పడి ఓ అంగీకారానికి వచ్చారు!

○○○

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారమైన లలిత సంగీత కార్యక్రమంలో, అంతకు ముందు ఆకాశవాణి నడిపిన పాటల పోటీల్లో మొదటి బహుమతి పొందిన భ్రమరి పాడిన పాట అది

జీవితమే ఓ స్వప్నము
తిరిగే రంగుల రాట్నము
విధిచేతుల కది అంకితము
సాగే బ్రతుకున క్షణికము !!జీవితమే!!
మాటలు రాని పసికందు
తియ్యని బోసి నవ్వులతో
నీరేదో నిప్పేదో
తెలియక పొరపడి తాకింది
పసితనమే తొలిఘట్టము
ఆపైన వచ్చును యవ్వనము !!జీవితమే!!
నందన వనమును చూసి
పూవులు పిందెలుకోసి
నీతేదో నిజమేదో
తెలియక త్వరపడి ఆడింది
అనురాగం ఒక విరామము
అనుభవమే తుదిఘట్టము !!జీవితమే!!

ఆ మరుసటి రోజున సాయంత్రం ఏడింటికి భారతి ఇంటికి ఫోన్ వచ్చింది - ''భ్రమరి గారితో మాట్లాడాలి... ఇంట్లో ఉన్నారా'' అంటూ.

''హల్లో... ఎవరు మాట్లాడ్తూంది'' పనమ్మాయి దగ్గర నుండి కార్డ్‌లెస్ ఫోన్ అందుకుని అడిగింది భారతి.

''మీరు రేడియోలో పాడిన పాట చాలా బాగుంది'' అవతలి కంఠం మర్యాదగా వినిపించింది.

''ఓ... అదా... థాంక్స్...'' మాట తడబడింది భారతి.

''మీ గొంతుక చాలా తియ్యనైనది...''

''మెనీ థాంక్స్...''

''అంత మంచి పాటని మీరు ఎంతో మధురంగా పాడినందుకు మీరు చాలా అభినందనీయులు...''

''మీరు చాలా ఎక్కువగా పొగిడేస్తున్నారు...''

''లేదండీ... మీలాంటి గానకోకిలని కన్న ఈ తెలుగుతల్లి చాలా అదృష్టవంతురాలు... తెలుగు సంస్కృతికీ సంగీతానికీ ప్రాణం పోస్తున్న మీ వంటి గాయనీ గాయకులు సర్వదా గౌరవనీయులే అవుతారండీ...''

''కొంపదీసి మీరు ప్రపంచ తెలుగు మహాసభలకు చెందిన వారు కాదు కదా...'' బెంగపడిపోయింది భారతి ఎక్కడ ఆహ్వానించి సత్కరించేస్తారో అని.

''అబ్బెబ్బె.. అలాంటిదేమీ కాదండి...''

''అయితే ఇంతకీ మీరు ఎవరు...'' కాస్త కుదుటపడింది ఆమె మనసు.

'అహ...' అని చిన్న సకిలింపు దగ్గు దగ్గుతూ ''భరత్... నా పేరు అండి అది... తెలుగు సాహిత్యమన్నా, సంగీతమన్నా ఎంతో మనసుపడే ఓ మామూలు మనిషిని... మీరు అనుమానపడ్డట్టు తెలుగు మహాసభల్లో వేదిక ఎక్కి ఇంగ్లీషులో ఉపన్యసించటం నాకు చేతకాదు - నచ్చనూ నచ్చదు...'' అతగాడి మాటల్లో ఓ చిరునవ్వు చిందులు త్రొక్కింది.

'బాగానే మాట్లాడ్తాడే ఈ అబ్బాయి' అనిపించింది ఆ కన్నె మనసుకి.

''బ్రతికించారు...'' అనేసి ఎందుకన్నానా ఆ మాట అని పెదవి కొరుక్కుంటూ ''మీ కాంప్లిమెంట్స్‌కి చాలా థాంక్స్ భరత్‌గారూ...'' అంది భారతి.

ఆ మాటల్లో 'ఇక ఫోన్ పెట్టేస్తాను' అన్న సందేశం

### జరిగిన కథ

పార్వతమ్మకు జ్యోతి, శృతి ఇద్దరు కూతుళ్ళు. జ్యోతి కాలేజీలో చదువుతుంటుంది. ఆమెను తన అన్నయ్య కొడుకు రవికిచ్చి పెళ్ళి చేయాలని పార్వతమ్మ ఆలోచన. లైఫ్‌ని ఎంజాయ్ చేయటం తెలియని బుద్ధావతారాల లాంటి రవి అంటే నాకు అసహ్యం అంటుంది జ్యోతి. కానీ రవికి కాఫీ ఇస్తున్నప్పుడు అతణ్ణే చూసి ఆమె ఎదలయల్లో ఏదో శృతి మొదలవుతుంది.

లాంటిది వినిపించింది అవతలి వ్యక్తికి.

''ఒక వేళ మళ్ళీ నేను ఫోన్ చేస్తే మీకేమైనా అభ్యంతరమా...'' అడిగాడు భరత్ ఎంతో మర్యాదగా.

''అవును... ఇంతకీ నా ఫోన్ నెంబరు మీకెలా దొరికింది..'' అవతలి వ్యక్తి చూసే అవకాశం లేకపోయినా అందమైన భారతి నుదురు వున్నట్టుండి ముడతలు పడింది అనుమానంతో, ఆసక్తితో!

''ఎంతో శ్రమపడి ఆకాశవాణి సౌజన్యంతో దక్కించుకున్నానంటే ఆగ్రహించుకుంటారా.... ఆశ్చర్యపడ్తారా..''

ఏదో తెలియని తియ్యదనం తొణికిసలాడింది ఆ మగరాయుడి కంఠంలో.

క్షణకాలం ఏం సమాధానం చెప్పాలో తోచక మంత్రించిన పుష్పంలా మైమరచిపోయి ఏదో ఆలోచిస్తూ ఆఖరికి – ''అదా సంగతి... తప్పకుండా ఫోన్ చేయండి... మీలాంటి శ్రోతల్ని ఆనందపరచటానికేగా లలితకళలన్నీ వున్నవి...'' అని చిన్నగా నవ్వేసి ఫోన్ ఆపేసింది భారతి.

మరో పావుగంట ఏం చేయాలో కాస్త దీక్షగా యోచించి ఫోన్ ఆన్ చేసి మరో నెంబరు డయల్ చేసింది బంతిపూవులాంటి ఆ భామిని!!

ООО

''రవిని భోజనానికి రమ్మని కబురు చేశారు మీ నాన్నగారు...'' అంది పార్వతమ్మ జ్యోతి తలకి చిక్కు తీస్తూ.

''ఎందుకట... ఈ హడావిడి...'' వెటకరించింది జ్యోతి.

''ఎందుకేమిటీ... ఈడొచ్చిన పిల్లవి... నీ పెళ్ళి ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా చేయటం మా బాధ్యత...'' అంది పార్వతమ్మ శాంతంగా.

''ఎవరితో... ఆ రవితోనా... ఛస్తే నేను చేసుకోను...'' రుసరుసలాడింది జ్యోతి.

''చచ్చేక పెళ్ళి ఎందుకు కాని.. నోర్మూసుకుని మీ నాన్నగారు చెప్పినట్టు చేయి'' కోపగించుకుంది పార్వతమ్మ కూతురి తీరు నచ్చక.

''మీ చేదస్తం కాని ఇప్పుడప్పుడే నాకు పెళ్ళేమిటే అమ్మా... ఇప్పుడే కదా డిగ్రీ కోర్సులో చేరింది... ఇంకో మూడు సంవత్సరాలు ఆగితే నా లా డిగ్రీ కూడా అవుతుంది... అప్పుడు ఆలోచించవచ్చు నా పెళ్ళి గురించి...'' అంది జ్యోతి బ్రతిమాలుతున్న ధోరణిలో.

''అంతవరకూ మీ మావయ్య ఆగొద్దటే....'' నచ్చచెప్పబోయింది పార్వతమ్మ.

''ఆగకపోతే పరుగెత్తి వెళ్ళమను.. కో అంటే కోటి మంది ఆడపిల్లల తండ్రులు క్యూలు కట్టకపోరు...



ఎవరో ఒకరికి కట్టపెట్టేయమను ఆ మహారాజశ్రీ గంగిరెద్దు గారిని...'' అంది రోషంగా జ్యోతి.

''ఛీ... ఏమిటా పాడు మాటలు... నీకేమైనా మతిపోతుందా.. పెద్దా చిన్నా అని లేకుండా నోటికి ఏదివస్తే అది వాగేస్తున్నావు...'' సహనం సన్నగిల్లి చిన్న మొట్టికాయ లాంటిది వేసింది పార్వతమ్మ జ్యోతి తలమీద.

''అబ్బ...'' అంటూ తలరుద్దుకుని – ''లేకపోతే ఏమిటే అమ్మా... ఏదో మీ అన్నగారు ఆరాటపడ్తున్నారని నా మెడ వంచి తాళి కట్టించేస్తావా ఏమిటి... నా ఇష్టా ఇష్టాలతో పని లేదా మీకు...'' సుమారు కంటతడిపెట్టినంత పని చేసింది జ్యోతి.



## షారూక్ పై కోర్టు కేసు

*దర్శకుడు ఎలా చెబితే అలా నటిస్తాడనే పేరు పొందిన షారూక్‌ఖాన్ ప్రతి సన్నివేశం దర్శకుడి సూచనల మేరకే చేస్తాడట. ఏ క్షణంలో ఏ ఎక్స్‌ప్రెషన్ కావాలంటే దాన్ని చూపించడం షారూక్ ప్రత్యేకత. అంత గొప్ప హీరోకి కోర్టు నోటీస్ రావడం అందరికీ ఆశ్చర్యంగా ఉండకపోదు. గతంలో షారూక్ ఖాన్‌పై కోర్టులో అజ్మీర్ న్యాయ వాదులు ఓ కేసు వేసి ఓడిపోయారు. 1995లో 'రామ్ జానే' చిత్రంలో షారూక్ డైలాగులు న్యాయవాదుల్ని కించ పరిచేలా ఉన్నాయని వారి వాదన. గత మేలో ఆ కేసు కొట్టివేశారు. అయితే ఆ న్యాయవాదులు పట్టువదలని విక్రమార్కుల్లా మళ్లీ రివిజన్ పిటిషన్ వేశారు. అందువల్ల ఆ కథ కంచికి పోకుండా మళ్లీ షారూక్ చేతిలోకి 'పెప్సీ బాటిల్'లా ప్రత్యక్షమైంది.*

''అది కాదమ్మా... నా బంగారు తల్లివి కదూ... నేను చెప్పినట్టు విను...'' కూతురిని బుజ్జగించింది పార్వతమ్మ.

''ఏమిటే వినేది.. నాకు నచ్చని వాడ్ని కట్టుకుని బ్రతుకుని కుండలు చేసి బండకేసి కొట్టుకోమంటావు..'' ఉక్రోషం పొంగిపొరలింది జ్యోతి మాటల్లో.

''అదికాదే జ్యోతీ... చిన్నప్పటి నుండీ బావా బావా అని తెగ పిలుస్తూ చక్కగా ఆడుకునే దానివి కదే రవితోటి... ఇప్పుడు వున్నట్లుండి అర్ధాంతరంగా ఏమొచ్చిందే నీకు... గత రెండు మూడు సంవత్సరాల నుంచి చూస్తున్నాను రవి అంటే నీకు అంత ఈసడింపు ఎందుకో నాకేమీ అర్థం కావటంలేదు...'' మరీకోపగించుకుంటే మొండికేస్తుందేమోనని మంచి మాటలతో సముదాయించటానికి నిర్ణయించుకుంది పార్వతమ్మ.

''ఏదో చిన్నప్పుడు ఆటలాడుకోవటానికి మొగుడు పెళ్ళాం అని అనుకున్నంత మాత్రాన అయిపోతామా ఏమిటి... పెరిగి పెద్దయ్యాక ఎవరి ఆశలు, అభిప్రాయాలు వారికుంటాయి... అసలు రవికి నేనంటే ఇష్టముందో లేదో నీకు తెలుసా... ఏమో బాబూ నాకు మాత్రం ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవాలనీ లేదు... రవిని చేసుకోవాలని అంతకంటే లేదు...''

తల్లి చేతుల్లోంచి జడను లాక్కుని విసవిసా లేచి వెళ్ళిపోయింది జ్యోతి.

'ఏమోబాబూ.. ఏం పిల్లలో ఏమిటో...'' నీరసపడి నీళ్ళుకారిపోయింది ఆ ఆడపిల్లల తల్లి పార్వతమ్మ.

ooo

పిలిచి పిలిచి నిను అలసితినో కృష్ణా
తలచి తలచి నిను సొలసితినో కృష్ణా
సేదతీర్చగరావా నీ వేణుగానము
వినిపించలేవా !!పిలిచి!!
సిరిమల్లె పూసిన బృందావనమున
మనసే రంజిల్లు నందన వనమున
ఆనాడు మురిపాల తేలించి నావయ్యా
ఈనాడు అవి కానరావేమయా !!పిలిచి!!

భ్రమరి పాడిన పాట రేడియోలో ప్రసారితమయ్యింది.

వేసిన అంచనా ప్రకారం ఆ మర్నాడు మళ్ళీ ఫోన్ వచ్చింది భారతికి.

''హలో మీ అమూల్యమైన కాలాన్ని వృధా పరుస్తున్నందుకు మన్నించాలి...'' అన్న అర్థం వచ్చేటట్టు ఆంగ్లంలో సంభాషణ ప్రారంభించాడు అభిమాన శ్రోత భరత్.

గొంతు సవరించుకుని - ''అబ్బే ఏమీ ఫర్వాలేదు...'' అన్న అర్థం వచ్చేటట్లు ఆంగ్లంలోనే సమాధానం ఇచ్చింది ఆ గాయత్రి.

''మీ కంఠంలో కాస్త మార్పు వచ్చినట్లుంది... జలుబుగాని చేసిందా మీకు...''

ఉలిక్కిపడి ''అబ్బెబ్బె.. అలాంటిదేమీ లేదే..'' అంది ఆమె తడబడుతూ.

''మీరు పాడిన కృష్ణుడి మీద పాట చాలా బాగుం దండీ భ్రమరి గారూ..''

''మీకు నచ్చినందుకు సంతోషం...''

''మీరు పాడే పాటలు మీరే రాస్తారా...''

''ఉహు... లేదండి... ఆకాశ వాణికి కొందరు పేరున్న రచయితలు వుంటారు... వారు వ్రాసిన పాటలన్నే మమ్మల్ని పాడమంటారు..''

''అలాగా.... ఏదేమైనా ఆ పాట మాత్రం మీ కమ్మని కంఠంలో నిజంగా ప్రాణం పోసుకుంది...''

''థాంక్స్...''

''ఏమీ అనుకోకపోతే మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను...''

''మీరు అడిగే ప్రశ్నను బట్టి వుంటుంది అనుకునేది అనుకోనిదీ..'' తన మాటలు తనకే వింతగా వినిపించాయి ఆ గాయత్రికి.

''ఏమీ లేదు మీరు చదువుకుంటున్నారా... ఉద్యోగం చేస్తున్నారా. వివాహితలా... అవివాహితలా... ఇలాంటి బేసిక్ విషయాలు తెలుసుకుందామన్న ఆసక్తితో అడుగుతున్నానంతే...''

ఒక్క చెట్టుకి పది రెమ్మల్లా తన ఒక్క ప్రశ్నలో పలు ప్రశ్నలు పుట్టించాడు భరత్ తెలివిగా.

''మీలాంటి అభిమానులు అభిమానించాల్సింది కళని కాని... కళాకారిణి స్వవిషయాల్ని మాత్రం కాదు... అందులో అంత డీప్ డీటె యిల్సా...'' అసమ్మతి వ్యక్తపరిచింది ఆ మధుర గాయని.

''అయామ్ వెరీసారీ...'' చటుక్కున మాటల్ని వెనక్కు తీసుకున్నాడు భరత్ చిన్నపుచ్చుకుని క్షమాపణ కోరుతూ.

''అయినా మీరు అడిగిన తీరు బాగుంది కాబట్టి చెప్తున్నాను... నేను ఓ డిగ్రీ చదువుతున్న విద్యార్థిని... ఏ కాలేజీ ఎక్కడ అని మాత్రం అడగ కండి సుమా...''

ఎందుకో ఆ గాయనికి ఆ మగవాడి మాట తీరు చూశాక ముచ్చటయ్యింది. మాటలు పెంచాలి అనిపించింది.

''అంటే అవివాహితలన్న మాటేగా'' ఎందుకో భరత్‌కి కూడా ఆ సంభాషణ సాగుతోన్న తీరు చాలా సర్దాగా వుందనిపించింది.

''అని ఎందుకనుకోవాలి... పెళ్ళి చేసుకుని చదువుకోకూడదా...''

''అబ్బెబ్బే... నా ఉద్దేశం అదికాదండీ... ఇలా నాలాంటి అభిమానులు మీకు ఫోన్‌చేస్తే మీ శ్రీవారు ఏమైనా అనుకుంటారేమోనని...''

''అభిమానికి మరో దురభిప్రాయం లేనప్పుడు ఆయన మాత్రం ఎందుకు అపోహపడాలి... అందులో మన సొసైటీ ఎంత మోడరన్‌గా మారి పోయిందో మాకు మాత్రం తెలీదా...''

మాటకి మాట అప్పగించింది ఆ మధుర గాయని.

''అదే కండడీ నా భయమంతా... ఎంత మోడరన్‌గా మారినా... అలాంటి విషయాలకి వస్తే మన సంఘంలో పాత చేదస్తాలు సనాతన సాంప్రదా

యాలు రాళ్ళలాంటి దేముళ్ళలా తెగపుట్టుకు వస్తుంటాయి...''

''అది కూడా బహుశా కొందరి మగవాళ్ళవల నేనేమో...''

ఎన్నో యుగాలుగా పరిచయం వున్న వ్యక్తితో మాట్లాడుతున్నట్లనిపించింది ఆ ఇరువురికీ ఆ క్షణం!

''ఆ విషయంలో మాత్రం మీతో ఏకీభవించ లేక పోతున్నందుకు మన్నించాలి.''

''భలేవారే... మరీ అంత అర్హులైతే మిమ్మల్ని ఓ ఆట ఆడించేయగలదు ఈ ఆడలోకం మహాశయా...'' ఆ చివరి ముక్కలు పలికి ఎందుకు అలా సంబోధించానా అన్నట్టు నాలిక కొరుక్కుంది ఆ మధుర గాయని.

ఆ పిలుపు భరత్‌ని కూడా కాస్త కదిలించింది.

''మీ హెచ్చరిక తప్పకుండా గుర్తుంచుకుంటాను..''

''మీరు ఏం చేస్తుంటారో చెప్పలేదు'' అడిగింది గాయత్రి భ్రమరి.

''ఇంతవరకూ మీరు అడగలేదు మరి... అడిగారు కాబట్టి చెప్పటం నా కర్తవ్యం'' - చిన్న చిరునవ్వు. మళ్ళీ సంభాషణ - ''నేను కూడా మీలా ఓ విద్యార్థినే డిగ్రీ కోర్సు చివరిమెట్టుకు చేరుకున్నాను..''




'ఎక్కడ ఏమిటి?' అని అడగాలనిపించే లోపల ఆమెలో ఏదో తెలియని కంగారు కలిగింది.

'అనవసరంగా పరిచయాన్ని పెంచుకుంటున్నానేమో' అదీ ఆ క్షణాన ఆ కన్నె మనసుకు కలిగిన ఆవేదన.

''థాంక్స్ ఫర్ కాలింగ్...'' అంది భ్రమరి ఓ నిర్ణయానికి వస్తూ.

''ఒక్క నిముషం... మిమ్మల్ని ఒక్కసారి కలు కోటానికి వీలవుతుందా?''

''ఎందుకు...''

దుడుకు ధ్వనించింది ఆ గాయని గొంతుకల

''ఎంతగానో అభిమానించే కళాకారిణిని ఓసా కళ్ళారా చూడాలని ఉవ్విళ్ళూరటంలో తప్పు దేమో...'' సౌమ్యంగా వివరించాడు భరత్.

మాట్లాడలేదు ఆ మధుర గాయని.


అన్ని విధములైన దగ్గు నుండి
తక్షణ నివారణకు




మెడిమిక్స్
కాఫ్ సిరప్

ఒక సాంప్రదాయమైన మూలికల సూత్రము
అన్ని తరముల వారికి

మిశ్రిత పదార్థములు
• కంటకారి • తులసి • భరంగి • కర్పూరం
• వంశలోచనం • గుడూచి • యష్టి మధు
• విల్వం • త్రికటు • వాసా మరియు కర్పూరవల్లి.

నివారించే రోగములు
- అలర్జీ వలన దగ్గు
- కఫం దగ్గు
- ధూమపాన దగ్గు
- గొంతు నొప్పి, ప్రాణంతెత్తువులో నొప్పి
- పొడి దగ్గు
- జలుబు దగ్గు

మా రోగులందు వైద్య తనిఖీచేసి ఎటువంటి వ్యతిరేక బాధింపు కనబడుటలేదు.

ఎటువంటి బాధ కలగకుండా
మలబద్ధకానికి చికిత్స

MEDIMIX EasyBowl Capsule
HERBAL LAXATIVE
మెడిమిక్స్ ఈజి బౌల్ క్యాప్సూల్
మూలికల విరోచనకారి.

సూచనలు:
- అన్ని విధములైన మలబద్ధకానికి
- హెర్నియా, గర్భందరించిన సమయములో మరియు కార్డియో వ్యాస్కులార్ అస్రకమం వలన వచ్చే విరోచనముల బాధ.
- పెద్దలు మరియు పిల్లలలో అస్రకమ విరోచనము
- ఫిస్టుల, ఫిషర్ మరియు పైల్స్ లో విరోచనమున కలిగే మంటలు.
- పూర్తి విరోచనము కలగలేని మనోబాధ.

త్రిఫల, యష్టిమధుతో కూడిన, ఒక సురక్షణమైన మరియు అలవాటు కానీయని విరోచనకారి.

CSY/Tel/24699-2000

మీ దగ్గు సమస్యల పరిష్కారానికి మా ప్రముఖ ఆయుర్వేద వైద్యుని ఉచితంగా సంప్రదించవచ్చు లేక మా చిరునామాకు వ్రాయండి
sowparnika
Sowparnika Herbal Extracts & Pharmaceuticals (P) Ltd.,
No.7, Chakravarthy Nagar, Ayanavaram, Chennai - 600 023. Ph: 6285327.

ప్రముఖ మందుల దుకాణాలలో లభించును

Mktd by: Dorcas Market Makers Ltd,
No.7, M-Block, Anna Nagar East, Chennai - 600 102. Ph: 6280801



## కలసి కట్టుగా శ్రమ

ఈ మధ్య బాలీవుడ్ తారలు సినిమాల కన్నా, అమెరికా ప్రదర్శనలకే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తున్నారు. తాజాగా 'కలసి ఉంటే కలదు సుఖం' అనుకున్నారో ఏమో మరి, టబూ, ఊర్మిళ, సుమన్ రంగనాథ్‌లు సినీ విభేదాలు మరచిపోయి కలసిపోయి అమెరికాలో ప్రదర్శనలివ్వడానికి వెళ్ల వచ్చారుట. అవి యమా హిట్ కూడా అయ్యాయని సమాచారం. అయితే ఇప్పుడు కొత్త మిలీనియంలో రూల్సు మార్చి రాసుకోవాలి కాబోలు – 'ప్రొఫెషన్‌లో పోటీ ఉండదు' అని. ఇంకా కలిసిపోయి ముగ్గురు హీరోయిన్లు తిరుగుతుంటే వాళ్లకి ముగ్గురు హీరోలు కూడ జోడీ అయితే ఇంకా బాగుంటుంది కదా! అంటున్నారు బాలీవుడ్ జనం.

''మీకు అంతగా ఇష్టం లేకపోతే వద్దులేండి'' చిన్న బుచ్చుకుంది భరత్ గాత్రం.

''ఆలోచించి చెప్తాను..''

చిరు ఆశ చిన్న తారలా తళుక్కున మెరిసింది అతడి మస్తిష్కంలో.

''అయితే మళ్ళీ నన్ను ఫోన్ చేయమంటారా'' అంతవరకూ మరో కార్డ్‌లెస్ రిసీవరు అందుకుని కథంతా వింటున్న భారతి మెల్లగా దగ్గరకు వచ్చి జ్యోతి భుజం తడుతూ 'ఊ' అనమన్నట్టు సైగచేసి చెప్పింది.

ఆఖరికి అయిష్టంగానే ''మీ ఇష్టం...'' అంది జ్యోతి.

ఫోన్ పెట్టేశాక–''నాకు తెలుసు నాకు తెలుసు... ఆ అభిమాని ఆ భ్రమరిని లవ్ చేసేస్తున్నాడే బాబూ..'' అంది భారతి స్నేహితురాలిని కౌగిలించుకుని అభినందిస్తూ, ఆటపట్టిస్తూ.

''ఏమిటో ఈ నాటకమంతా... నాకేమీ నచ్చ లేదే...మా అమ్మకి నాన్న గారికి ఈ విషయాలన్నీ తెలిశాయంటే నిజంగా కొంపలంటుకుంటాయి'' అంది జ్యోతి డీలాపడిపోతూ.

''నీకా బెంగేమీ అక్కర్లేదే మైడియర్ జ్యోతీ... ఆ అభిమాని ప్రేమిస్తుంది నిన్ను కాదులేవే... భ్రమరి అనే గాయత్రిని... నేనున్నానుగా అవతారం ఎత్తి నిన్ను ఆదుకోటానికి...''

ధైర్యం చెప్పింది భారతి.

అన్యమనస్కంగా ఇంకేదో ఆలోచిస్తూ ''ఊ.. ఏదో కానీ'' అంది జ్యోతి.

OOO

కాలేజీ పూర్తయ్యాక ఇంటికి వెళ్ళే ముందు ఓ సాయంత్రం –

''నీతో అర్జెంటుగా మాట్లాడాలే... మీ ఇంటికి రమ్మంటావా మా ఇంటికి వస్తావా...'' అని అడిగింది జ్యోతి.

''మా ఇంటికి వెళ్దాం.. ఆ తరువాత కారులో మీ ఇంటి దగ్గర దిగబెడ్తాను...'' అంది భారతి కాలేజీ ప్రాంగణంలో కారు ఆపి తనకోసం వేచి వున్నాడు డ్రైవర్ అన్న సంగతి పసికట్టి.

కాఫీ ఇచ్చి అతిథి సత్కారాలు చేశాననిపించాక మేడమీద తన గదిలోకి తీసుకు వెళ్ళి అడిగింది భారతి –

''ఏమిటే నిన్ను అంతగా వర్రీ చేస్తున్న విషయం...''

జ్యోతి ముఖంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తోన్న పరధ్యానాన్ని, దిగులిని ఇట్టే పసికట్టేసింది భారతి.

''మా బావతో నా పెళ్ళి కుదిర్చేస్తున్నారు మా పెద్ద వాళ్ళు...''

''ఆరినీ.. ఎంతో సంతోషించాల్సిన విషయాన్ని ఇంత డల్‌గా నీళ్ళు కారిపోతూ చెప్తున్నావా...'

''అదికాదే భారతీ...''

''ఏదికాదే... ముందు హార్టీ కంగ్రాట్యులేషన్స్‌కి బదులుగా ఓ పెద్ద పార్టీ ఆపైన అసలైన పెళ్ళి పార్టీ రెండూ కావాలి నాకు...''

''అబ్బ చెప్పేది విను.. ఎందుకో నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు...''

''పెళ్ళి ఇష్టం లేదా... పెళ్ళి కొడుకు నచ్చలేదా''

నొక్కి నొక్కి అడిగింది భారతి స్నేహితురాలి ముఖంలోకి తమాషాగా చూస్తూ.

''నీకు తెలుసుగా రవి ఎలాంటి వాడో...''

''నాకెలా తెలుస్తుందే... నేనెప్పుడైనా అతగాడ్ని కలుసుకున్నానా .. ఏదో పాపం నా ఫ్రెండ్ అని పరిచయం చేశావా నువ్వు...'' దెప్పింది భారతి.

''అదేనే నేను చెప్పానుగా నీకు... రవి అదొక రకమైన మనిషి. ఓ సర్దా లేదు. ముచ్చటలేదు.. ఎప్పుడూ సీరియస్‌గా వుంటాడు...''

''సో వాట్...''

''అలా నీరసపడి నసుగుతూ బ్రతికే మనుషులంటే నాకు అయిష్టం అని నీకు తెలుసుగా...''

''అలా ఎందుకనుకోవాలి... ఏదో ముద్దుల మరదలవని మొహమాటం కొద్దీ అలా బిహేవ్ చేస్తున్నాడేమో మీ బావ...''

''అబ్బ నీకు తెలుసా... నాకు తెలుసా రవి సంగతి...'' విసుక్కుంది జ్యోతి భారతి ధోరణి నచ్చక.

''ఆల్‌రైట్ ఆల్‌రైట్... అయితే నీకు అతగాడితో పెళ్ళి ఇష్టంలేదని గట్టిగా నొక్కి చెప్పేసెయ్ మీ పెద్ద వాళ్ళతో... లేదా మీ బావని ప్రక్క గదిలోకి తీసుకు వెళ్ళి కాస్త పన్నీరుకొట్టి గట్టిగా ఆ లెంపా ఈ లెంపా వాయించేసి ఇంకెప్పుడూ నాతో పెళ్ళి జోలికి రావద్దు అని చెప్పేసెయ్..'' ఫక్కున నవ్వింది భారతి ఆట పట్టింపుగా.

''నీకు వేళాకోళంగానే వుంటుందే... బాగా నీ మెడ వంచి ఓ గుదిబండని దిగేస్తే మీ పెద్ద వాళ్ళు అప్పుడు నీకు తెలిసి వస్తుంది ఆ బాధేమిటో...''

''సారీ జ్యోతీ ఏదో సర్దాకి అన్నాను లేవే... హాస్యాన్ని కూడా అంత సీరియస్‌గా తీసుకుంటే ఎలా చెప్పు... ఓ పని చేద్దాం.. నేను ఓ మంచి ఐడియా ఇస్తాను ప్రయత్నించి చూడు...'' జ్యోతి చెవిలో రహస్యంగా ఏదో వల్లించింది భారతి.

''అమ్మో బావతో టాంక్‌బండ్ మీద షికారే... నా వల్ల కాదు బాబు...'' అంది జ్యోతి వత్తయిన లేత గుండెల్లో బెంగని బిగించి వేసుకుంటూ.

''ఏడిసినట్లుంది... నిన్నెవరూ షికార్లు చేయమనటం లేదు... ఆ పేరు పెట్టుకుని వెళ్ళి మనసులో ఏముందో కనిపెట్టమంటున్నాను...''

''ఏమో బాబూ... ఆ బెల్లం దిమ్మతో నా వల్ల కాదు...''

''బెల్లం కొరుక్కుతింటే తియ్యగానే వుంటుంది కాని... వర్రీ అవ్వకు...'' ధైర్యే సాహసే లక్ష్మీ అంటూ వెన్నుతట్టి జ్యోతికి ధైర్యం చెప్పింది భారతి.

(ఇంకా వుంది)